

# వారసత్వం

చొక్కారావు ఆ ఆఫీసులో జూనియర్ అసిస్టెంటు. పరమలోభి.

ఏనాడు దేనికీ పైసా చందా ఇచ్చిన పాపాన పోతే ఒట్టు. పోనీ తనేమైన అనుభవిస్తున్నాడా అంటే అదీ లేదు. జీతంలో మూడొంతులు ఆటోమేటిగ్గా బ్యాంకులో జమ అయిపోతూ వుంటుంది. ఉన్నదాంతోనే ఉస్సూరుమంటూ రోజులు వెళ్ళదీస్తాడు.

మొన్నీ మధ్య చొక్కారావు ఓ జ్యోతిష్కుడికి చేయి చూపించుకున్నాడు.

జ్యోతిష్కుడు రేఖల్ని భూతద్దంతో పరిశీలించి "నీకు వారసత్వంగా వచ్చేవి చాలా ఉన్నాయి" అన్నాడు రపీమని.

"ఊరికే ఊరించబోకండి స్వామి. మా అయ్య, తాత నన్నేనాడో కట్టుబట్టలతో వదిలేసి వెళ్ళిపోయారు. ఇహ వారసత్వంగా నాకొచ్చేదేమిటి బొచ్చు"

నిస్పృహ ధ్వనించింది చొక్కారావు మాటల్లో. "హస్తసాముద్రిక శాస్త్రాన్ని అంత తేలిగ్గా తీసిపారేయకండి. మీకు వారసత్వంగా లభించబోయేవి ఎన్నో వున్నాయన్న విషయం మీ రేఖల్లో కొట్టొచ్చినట్లు కనబడుతోంది. కొంతకాలం వేచిచూడండి. అప్పుడు తప్పకుండా నమ్ముతారు నా మాటల్ని" స్థిరంగా పలికాడు జ్యోతిష్కుడు.

అతడి మాటలు చొక్కారావులో ఆశల్ని రేపింది. అకస్మాత్తుగా నిధి ఏమైనా కంటపడకపోతుందా అని కలలు కనసాగాడు. భవిష్యత్తులో రాబోయేవి ఎన్నో ఉండగా కడుపుకట్టుకోవడం దేనికనుకున్నాడు. దాని ఫలితమే అతడిలో వచ్చిన ఈ మార్పు.

ఒకరోజు వంట్లో నలతగా వుంటే ఆఫీసుకు సెలవుపెట్టి డాక్టరు దగ్గరకెళ్ళాడు చొక్కారావు. డాక్టరు పరీక్షలన్నీ చేసి అతడికి 'క్షయ' అని నిర్ధారించాడు. విలువైన ఆహారం, ఖరీదైన మందులు వాడితే తప్ప రోగం నయమవదన్నాడు.




వళ్ళు మండింది చొక్కారావుకి.

జ్యోతిష్కుడు చెప్పినట్లు వారసత్వంగా వచ్చేవి రాకపోగా ఉన్నది ఊడ్చిపెట్టడానికన్నట్లు ఈ జబ్బేమిటి అంటూ డాక్టరు ముందే విసుక్కున్నాడు.

వెంటనే అతడి మాటలకు స్పందిస్తూ "క్షయ మీ వంశంలో ఎవరికైనా ఉండేదా?'' అని అడిగాడు డాక్టరు.

"మా తాతకి ఉండేదట'' అన్నాడు చొక్కారావు.

"మరి సుగరు''

"అది మా నాన్నకుండేది''

"మీలో ఆ రెండూ ఉన్నాయి. ఓ రకంగా జ్యోతిష్కుడు చెప్పింది నిజమే. టి.బి., డయాబిటిస్ మీకు వారసత్వంగా సంక్రమించాయన్నమాట.'' సందేహం వెలిబుచ్చాడు డాక్టరు.

మరి మాట పెగల్లేదు చొక్కారావుకి.

( 29 ఏప్రిల్ 1999, ఆంధ్రభూమి వీక్లీ )